క్లుప్తంగా

తెగిపడిన విద్యుత్ తీగలు



వర్ధన్నపేట : వర్ధన్నపేట సబ్‌స్టేషన్‌కు సరఫరా అయ్యే ప్రధాన విద్యుత్ లైన్ తీగలు డీసీ తండా శివారులో శనివారం సాయంత్రం తెగిపడ్డాయి. దీంతో రాయపర్తి, అన్నారం, మైలారం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో అధికారులు అప్రమత్తమై ప్రత్యామ్నాయంగా సరఫరాను పునరుద్ధరించారు. విద్యుత్ లైన్ నిర్మానుష్య ప్రదేశంలో ప్రధాన తీగ తెగిపడడంతో పెనుప్రమాదం తప్పింది.

రైతులు అధైర్యపడొద్దు



దుగ్గొండి: ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు పండించిన ప్రతి మొక్కజొన్న గింజను కొనుగోలు చేస్తుందని, ఏ రైతు అధైర్యపడొద్దని జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని లక్ష్మీపురంలో మక్కల కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మక్కల రైతులకు ఇబ్బందులు కలిగించవద్దని, వారి కష్టాలను గట్టెక్కించడానికి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. రంగుమారిన గింజలను సైతం కొనుగోలు చేసి ఆర్థిక భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సుకిన రాజేశ్వర్‌రావు, సర్పంచ్ పాండవుల సురేందర్, ఎంపీటీసీ మామునూరి సుమన్, డైరెక్టర్లు గోసంగి పురుషోత్తం, ముక్కిడి ప్రభాకర్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరి మృతి



కిరణ్‌కుమార్ (ఫైల్)

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ గరీబ్‌నగర్ శివారులో శుక్రవారం రాత్రి బైక్ అదుపు తప్పి ఓ వ్యక్తి మృతి చెందాడు. మృతుడి భార్య, పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని అబ్బనికుంటకు చెందిన గుండా కిరణ్‌కుమార్(41) ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. దేశాయిపేటలోని తన మిత్రుడు పోగుల సృజన్ ఇంటికి బైక్‌పై వెళ్లి అదే వాహనంపై రాత్రి 11.30 గంటలకు ఇంటికి తిరిగి వస్తున్నాడు. గరీబ్‌నగర్‌కు చేరుకోగానే అతివేగంగా అజాగ్రత్తగా నడపడంతో రోడ్డు పక్కన ఉన్న మోరీపైపుకు ఢీకొట్టాడు.ఈ ప్రమాదంలో కిరణ్‌కుమార్‌కు తీవ్ర గాయాలు కాగా అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం మృతుడి భార్య మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ సట్ల రాజు తెలిపారు.

దొంగతనం ఛేదించిన పోలీసులు

చెన్నారావుపేట: ఇంట్లో చొరబడి దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై తోట మహేందర్ శనివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం... చెన్నారావుపేటకు చెందిన బొంత సురేష్ కుటుంబ సభ్యులు మూడు రోజుల క్రితం బంధువుల ఇంటికి వెళ్లగా మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులకొట్టి జత బంగారు కమ్మలు, మూడు గ్రాముల వన్ గ్రామ్ బుట్టలు, ఆరు తులాల వెండి పట్టీలు, సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. విచారణలో నర్సంపేట మండలానికి చెందిన నిడిగొండ రాజు దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించి మగ్దుంపురం సమీపంలో అరెస్ట్ చేసి పూర్తి సొమ్మును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వెల్లడించారు. తక్కువ సమయంలో దొంగతనం కేసును ఛేదించిన ఎస్సైని సీఐ హతిరాం, ఏసీపీ సంపత్‌రావులు అభినందించారు.

రైతులు ఆందోళన చెందవద్దు

చెన్నారావుపేట: ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని సొసైటీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణరెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని పాపయ్యపేట, చెన్నారావుపేట, ఎల్లాయగూడెం, ఉప్పరపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మిల్లర్లు హమాలీల సంఖ్యను పెంచి అలస్యం చేయకుండా ధాన్యం దిగుమతి చేయాలన్నారు. రైతులకు టోకెన్ల జారీ ప్రక్రియ వేగవంతం చేస్తామన్నారు. ఏజెన్సీలు రైతులకు అన్ని వసతులు కల్పించాలని సూచించారు.

సీపీఎం నేతలపై కేసు

ఖిలా వరంగల్: శంభునిపేటలోని ఆర్‌ఆర్‌గార్డెన్‌లో అనుమతి లేకుండా సీపీఎం నేతలు పుచ్చలపల్లి సుందరయ్య సంతాప సభను శుక్రవారం నిర్వహించటమే కాకుండా రోడ్డుపై వాహనాలు పార్కు చేశారు. ఈ క్రమంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం కల్పించారని సీపీఎం నేతలు మాలోతు సాగర్, జిల్లా అధ్యక్షుడు రంగయ్య, పలువురి నేతలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాంబయ్య శనివారం తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని స్థానిక ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం క్యాంపు కార్యాలయంలో అధికారులు, కొనుగోలు ఏజెన్సీలు, ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీలు, రైస్ మిల్లర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ రైతులకు కావల్సిన అన్ని రకాల సౌకర్యాలు, 24 గంటల ఉచిత విద్యుత్, ప్రాజెక్టుల ద్వారా సాగునీరు, నాణ్యమైన విత్తనాలు, ఎరువుల అదించడంతో పంటసాగుతో పాటు దిగుబడి పెరిగిందన్నారు. ఈ సంవత్సరం యాసంగిలో లక్షా 21వేల ఎకరాల్లో పంట సాగు అయిందన్నారు. పీఏసీఎస్, ఓడీసీఎంఎస్, ఐకేపీ, ఎఫ్‌పీఓల ద్వారా ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. పాకాల, రంగాయ చెరువులు, మాధన్నపేట చెరువుల్లో గోదావరి జలాలతో నింపడం వల్ల ఈ సంవత్సరం అత్యధికంగా వరిసాగు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా 92 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీలు లారీల సంఖ్య, ఇతర వాహనాలను పెంచాలన్నారు. రైస్ మిల్లర్ల యాజమాన్యం హమాలీల సంఖ్యను పెంచి ఆలస్యం కాకుండా దిగుమతి చేసుకోవాలని, వ్యవసాయ అధికారులు టోకెన్ల జారీ ప్రక్రియ ఆలస్యం కాకుండా చూసుకోవాలన్నారు. సమీక్ష సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్, ఓడీసీఎంఎస్ చైర్మన్, ఎంపీపీలు, డీసీఓ, డీఎం సివిల్ సప్‌లెస్త్, డీఎస్ఓ, అగ్రికల్చర్ జేడి, ఏసీపీ, ఐకేపి పీడి, డీపీఓ, మార్క్‌ఫెడ్ డీఎం, రైస్ మిల్లర్లు, పీఏసీఎస్ చైర్మన్, పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి



కబ్జాకు గురైన భూమిని పరిశీలిస్తున్న బీజేపీ నేతలు

నర్సంపేట : ప్రభుత్వ భూములను కాపాడాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాల్నె జగన్ అన్నారు. పట్టణంలోని 18వ వార్డు ఏసీపీ కార్యాలయం పక్కన కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని శనివారం బీజేపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములను కాదాల్సిన నాయకులే కబ్జాలకు పాల్పడుతున్నారన్నారు. సుమారు 8 గుంటల ప్రభుత్వ భూమిని అప్పటి జాయింట్ కలెక్టర్ వాకాటి కరుణ హయాంలో దగ్గరుండి ఈ భూమికి హద్దురాళ్లను పాతించారన్నారు. ఆ భూమిలో ఎరుకలి సామాజిక వర్గానికి సంబంధించిన కొందరు నిరుపేదలు గత 30 ఏళ్లుగా గుడిసెలు వేసుకొని జీవనం గడుపుతున్నారన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత ఆ భూమిపై కన్నుపడ్డ బీఆర్ఎస్ నాయకులు తప్పుడు పత్రాలు సృష్టించి శుక్రవారం రాత్రి గుడిసెలు తొలగించి మొరం పోసి కబ్జా చేశారన్నారు. కలెక్టర్, రెవెన్యూ అధికారులు, ఆర్డీఓ, తహసీల్దార్, మునిసిపల్ కమిషనర్ తక్షణమే స్పందించి కబ్జా చేసిన వారిపై కేసు నమోదు చేసి ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ వడ్డేపల్లి నర్సింహరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి కొంపెల్లి రాజేందర్, కల్వచర్ల రామాంజనేయులు, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పంజాల రాము, ఎస్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు దుగ్యాల సమ్మయ్య, సీనియర్ నాయకుడు కూనమల్ల పృధ్వీరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు వైద్యసేవలు అందించడానికే ఉపకేంద్రాలు



ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న సర్పంచ్ మంజుల, తదితరులు

దుగ్గొండి: ప్రభుత్వం గ్రామీణ ప్రజలకు చేరువలో వైద్యం అందించడానికి ఉపకేంద్రాలను శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేయడం అభినందనీయమని సర్పంచ్ తోకల మంజుల నర్సింహారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణం కోసం ప్రభుత్వం రూ. 20 లక్షలు మంజూరు చేసిందన్నారు. ఈ మేరకు శనివారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యాధికారి కిరణ్‌రాజ్, ఈఓ సాంబయ్య, ఉప సర్పంచ్ పెండ్యాల రాజు, ఆంద్రు రత్నాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న సంస్థ చైర్మన్ శోభారాణి

చెన్నారావుపేట: మండలంలోని కోనాపురంలో షాందాసిని ఫౌండేషన్ సాయిబాబా షిరిడి వారి సహకారంతో శనివారం పేద పిల్లలకు బుక్స్, పలకలు, పెన్నులు, కంపాక్స్‌లు, వృద్ధులకు దుప్పట్లను ధరణి స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ కల్లెపు శోభారాణి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సంస్థ భారత దేశంలోని అనేక స్వచ్ఛంద సంస్థల ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తుందన్నారు. గత 25 ఏళ్లుగా సామాజిక సేవా కార్యక్రమాలు ధరణి స్వచ్ఛంద సంస్థ ద్వారా చేయడం సంతోషంగా ఉందన్నారు. సొంత గ్రామంలో దుప్పట్లు, పిల్లలకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నర్సింహరావు, వార్డు సభ్యులు చిరంజీవి, మాజీ సర్పంచ్ శోభా తిరుమల్, సంస్థ కో ఆర్డినేటర్ రమేష్, సంఘ సేవకులు కల్లెపు ప్రణీత్, కిరణ్, హేమంత్, అరుణ్, వినయ్, నగేష్‌లు పాల్గొన్నారు.

కాట్రపల్లిలో అ'పూర్వ' సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

రాయపర్తి: మండలంలోని కాట్రపల్లిలో 2005-2006 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ గురువులు రామ్‌ప్రసాద్, అనిల్, షకీరాబేగంలను సన్మానించారు. గత స్మృతులను నెమరువేసుకుంటూ సంతోషాన్ని వెలిబుచ్చారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రామకృష్ణ, సతీష్, రమేష్, మహేష్, అశోక్, రాజశేఖర్, రాజు, భాస్కర్, పర్వీన, స్వర్ణలత, మమత, బాలరాణి, రాజేశ్వరి, హరీఫా, యకూబీ, హైమ తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీని బొందపెట్టాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి



మాట్లాడుతున్న మేకల రవి

నెక్కొండ: దేశంలో కుల, మత భేదాలతో ప్రజలను రెచ్చగొట్టి ఓటు బ్యాంకు కోసం తహతహలాడుతున్న మతోన్మాద బీజేపీని బొంద పెట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి పిలుపునిచ్చారు. మండలంలోని పనికరగుట్ట సమీపంలో పార్టీ ఆధ్వర్యంలో నిరుపేదలు వేసుకున్న గుడిసెల ప్రాంతంలో శనివారం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ హటావో.. దేశ్‌కీ బచావో నినాదంతో సీపీఐ చేపట్టిన ఇంటింటికీ ప్రజాపోరు యాత్ర ముగింపు సభను కొత్తగూడెంలో ప్రజాగర్జన పేరుతో జూన్ 4న నిర్వహిస్తున్నట్లు, ఈ సభను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఆ పార్టీ మండల కార్యదర్శి కందిక చెన్నకేశవులు, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేశ్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మియాపురం గోవర్ధనచారి, ఎన్ఐఎఫ్‌డబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు కవిత, నాయకులు సంపత్‌రెడ్డి, మల్లయ్య, ఉప్పలయ్య, యాకయ్య, వెంకటలక్ష్మి, రజిత, రాధిక, పద్మ, సావిత్రి, నర్సయ్య, భిక్షపతి, బాబు, కళావతి, కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

'మల్లన్న' ధర్మకర్తకు పరామర్శ



ఐనవోలు : మండల కేంద్రానికి చెందిన ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి ఆలయ ధర్మకర్త బొల్లేపల్లి వెంకటేశ్వర్లును డీసీసీబీ చైర్మన్, ఆలయ పెద్దరథం నిర్వాహకుడు మార్నేని రవీందర్‌రావు పరామర్శించారు. వెంకటేశ్వర్లు తల్లి బొల్లేపల్లి వజ్రమ్మ(85) అనారోగ్య కారణాలతో శనివారం మృతి చెందింది. ఈ క్రమంలో ఆమె మృతదేహానికి మార్నేని రవీందర్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వజ్రమ్మ కొడుకులైన వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, తిరుపతిలను ఓదార్చారు. చైర్మన్ రవీందర్‌రావు వెంట ఆలయ మాజీ చైర్మన్‌లు మునిగాల సంపత్ కుమార్, వడిచర్ల శ్రీనివాస్, ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, సర్పంచ్ జన్ను కుమారస్వామి, ఉప సర్పంచ్ అడ్డగూడి సతీష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యేల పరామర్శ



చెన్నారావుపేట : సారమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పెద్ది, తదితరులు



వర్ధన్నపేట : నిహారిక చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అరూరి రమేష్

చెన్నారావుపేట : మండలంలోని అమీనాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు బాల్నె వెంకన్న తల్లి సారమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామి నాయక్ శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ మండల కన్వీనర్, వైస్ ఎంపీపీ కంది కృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్లు ముద్దసాని సత్యనారాయణరెడ్డి, మురహరి రవి, బీఆర్ఎస్ జిల్లా డైరెక్టర్ తూటి శ్రీనివాస్, మండల కన్వీనర్ బుర్రి తిరుపతి, అమ్మరాజేష్, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, ఉన్నారు.

దుగ్గొండి: మండలంలోని నాచినపల్లికి చెందిన బీఆర్ఎస్ మండల నాయకుడు మట్ట రాజు నానమ్మ లచ్చమ్మ శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పెద్ది మృతురాలి కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. పెద్ది వెంట జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఎంపీపీ కాట్ల కోమల, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుకిన రాజేశ్వర్‌రావు, నాయకులు శంకేసి కమలాకర్, తోటకూరి రాజు, పిండి కుమారస్వామి, గుడిపల్లి జనార్ధన్‌రెడ్డి, బొమ్మినేని శ్రీనివాసరెడ్డి, మోహన్, రాజిరెడ్డి, తదితరులు ఉన్నారు.

వర్ధన్నపేట: మండలంలోని కట్య్రాలకు చెందిన బీజేపీ నాయకులు కుందూరు మల్లారెడ్డి కూతురు నిహారిక, చెన్నలకుంటి బుచ్చయ్య ఇటీవల మృతి చెందగా శనివారం ఎమ్మెల్యే అరూరి రమేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. బుచ్చయ్య కుటుంబానికి ఆర్థికసాయం అందచేశారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, తదితరులు ఉన్నారు.

అకాల వర్షంతో రైతులు ఆగమాగం



రైతులకు సహకరిస్తున్న ఎస్సై, పోలీసులు

ఖానాపురం : వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో రైతన్నలు ఆగమాగమయ్యారు. పాకాల ఆయకట్టులో కోతలు దాదాపుగా చివరి దశకు చేరుకొని కొనుగోలు కేంద్రాలకు ధాన్యపు రాశులు చేరాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రత ఎక్కువగానే ఉండటంతో రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకున్నారు. సాయంత్రం వేళలో ఒక్కసారిగా వాతావరణ మార్పులు చోటు చేసుకొని వర్షం పడటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం నుంచి కాపాడుకోవడానికి కుప్పలుగా చేసుకొని టార్పాలిన్లను కప్పుకున్నారు.

అండగా నిలిచిన పోలీసులు

శాంతిభద్రతల పరిరక్షణే కాకుండా రైతన్నలకు అండగా నిలిచారు పోలీసులు..ఆకాశం వైపు చూస్తూ రైతన్న ఆగమాగం అవుతూ ధాన్యాన్ని దగ్గరకు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో మనుబోతులగడ్డ వైపు వెళ్లిన ఎస్సై తిరుపతి, కానిస్టేబుళ్లు రమేష్, సుమన్, హోంగార్డు ఎర్రయ్యలతో పాటు మరికొంత మంది సిబ్బంది రైతుల తంటాలను చూసి అండగా నిలిచారు. వర్షం నుంచి ధాన్యాన్ని కాపాడటానికి ధాన్యాన్ని దగ్గరకు చేసి తాటిపత్రిలను కప్పి అండగా నిలిచారు. దీంతో పలువురు రైతులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు



ఖానాపురం : ఫ్లెక్సీని ఏర్పాటు చేయిస్తున్న సీఐ సూర్యప్రసాద్

ఖానాపురం : ధాన్యం కొనుగోళ్లలో రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నర్సంపేట రూరల్ సీఐ సూర్యప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు, పోలీస్ అధికారుల నంబర్లతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి హమాలీలకు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తేమ పేరుతో తరుగు తీయొద్దన్నారు. తూకంలో మోసాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తిరుపతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాయపర్తి: రైతులను తరుగు పేరుతో మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని వర్ధన్నపేట సీఐ సదన్‌కుమార్ హెచ్చరించారు. శనివారం మండలకేంద్రంలోని మార్కెట్ యార్డుతో పాటు మైలారంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ రైతులు తీసుకువచ్చిన ధాన్యంలో తాలు పేరుతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం తూకంలో ఎక్కువ తరుగు తీయకూడదన్నారు. ధర్మకాంట వద్ద డబ్బుల వసూళ్లకు పాల్పడినా సమాచారం అందించాలని రైతులను కోరారు. ఆయన వెంట స్థానిక ఎస్సై బండారి రాజు, కానిస్టేబుళ్లు సంపత్ ఉన్నారు.

వర్ధన్నపేట : రైతులు దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యంను విక్రయించుకొని ప్రభుత్వ మద్దతు ధర పొందాలని స్థానిక ఎస్సై రామారావు అన్నారు. శనివారం మండలంలోని దమ్మన్నపేట, దివిటిపల్లి, రామవరం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించి తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు రైతులు తాలు, మట్టి చెత్త లేకుండా శుభ్రపరిచి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. కొనుగోలు చేసిన కొద్ది రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని తెలి పారు. చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు.

చెన్నారావుపేట : రైతులు తీసుకొని వచ్చిన ధాన్యంను తాలు పేరుతో తరుగు తీస్తే సమాచారం ఇవ్వాలని ఎస్సై తోట మహేందర్ తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఫ్లెక్సీని ఏర్పాటు చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రేడు ఏ రకంకు రూ.2060, సాధారణ రకంకు రూ. 2040 ధర నిర్ణయించనట్లు తెలిపారు. రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురి చేసినా ఎస్సై 8712685237, సీఐ 8712685235, ఏసీపీ 8712685229, జోన్ డీసీపీ 8712685222, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ 8712685101, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ 8712685148 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.



రాయపర్తి: నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఐ



వర్ధన్నపేట: కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్సై



చెన్నారావుపేట : ఫ్లెక్సీని ఏర్పాటు చేసిన ఎస్సై

భూకబ్జాదారులతో కుమ్మక్కైన అధికారులు

- సీపీఎం జిల్లా కార్యదర్శి రంగయ్య



మాట్లాడుతున్న చింతమల్ల రంగయ్య

నర్సంపేట: రెవెన్యూ అధికారులు భూ కబ్జాదారులతో కుమ్మక్కై చట్టాలను విస్మరిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి చింతమల్ల రంగయ్య అన్నారు. శనివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో పట్టణ కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రంగయ్య మాట్లాడుతూ.. పట్టణంలోని కాకతీయనగర్ శివారు 601/1 సర్వే నంబర్‌లోని గుడిసెలు వేసుకున్న పేదలను పోలీసులు భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. పట్టణంలో కోట్ల విలువైన ప్రభుత్వ భూముల్ని కొందరు కబ్జా చేస్తూ అక్రమ కట్టడాలు జరుపుతున్నా పట్టించుకోని అధికారులు పేదలపై దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా నర్సంపేట రెవెన్యూ అధికారులు పేదలను ఇబ్బంది పెట్టే ఆలోచన విరమించుకోవాలని లేదంటే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొరబోయిన కుమారస్వామి, జిల్లా కమిటీ సభ్యులు నమిండ్ల స్వామి, హన్మకొండ శ్రీధర్, ముంజాల సాయిలు, అనంతగిరి రవి, పట్టణ నాయకులు గడ్డమీది బాలకృష్ణ, కందికొండ రాజు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడులు

హసన్‌పర్తి: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధి యాదవనగర్‌లోని ఓ పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ బృందం శనివారం దాడులు నిర్వహించింది. నలుగురిని అదుపులోకి తీసుకోగా, మరో నలుగురు పరారైనట్లు, నిందితుల నుంచి రూ.7,040 నగదుతో పాటు ఐదు సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి తెలిపారు. యాదవనగర్‌లోని ఓ కేంద్రంలో పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ బృందం దాడులు నిర్వహించింది. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న ఏనుగులగడ్డకు చెందిన మూల శ్రీధర్, హనుమకొండ సుధానగర్‌కు చెందిన సిద్దపటి శ్రీనివాస్, హనుమకొండకు చెందిన కిమిడి నీలం, కుమార్‌పల్లికి చెందిన సాంబార పోచాలును అదుపులోకి తీసుకున్నారు. హనుమకొండకు చెందిన మహేందర్, రాయపురకు చెందిన పున్నంచందర్, రాచర్ల శ్రీను, గుర్రాల శ్రీకాంత్ పరారైనట్లు ఏసీపీ వివరించారు.